మామూలు కథే

డి. కామేశ్వరి

"లలితా!" స్కూటరు దిగి హుషారుగా యీల వేసుకుంటూ గుమ్మంలోకి అడుగుపెట్టిన శేఖర్‌కి రోజూ చిరునవ్వుతో గుమ్మంలోనే ఎదురయే లలిత కనిపించకపోవడంతో కాస్త ఆశాభంగం కలిగింది.

పదిహేను నిమిషాలు ముందుగా వచ్చానుగా— అని వాచ్ చూసుకొని స్వగతం చెప్పుకొంటూ లోపలికి నడిచాడు. డ్రాయింగురూం, వసారా... ఎక్కడా పత్తాలేదు. తిన్నగా పడగ్గది వైపు నడిచాడు. ఆవేళప్పుడు అక్కడ ఉండడం అరుదు.

"పడుకున్నావేం? ఒంట్లో బాగాలేదా?" మంచంమీద ఓ పక్కగా కూర్చొని అతనివైపు తిప్పుకుంటూన్న శేఖర్ చేతుల్ని విసురుగా తప్పించుకొని లేచి వంటయింటివైపు వెళ్ళిపోయింది లలిత.

ఈ విసురు గమనించనట్టు శేఖర్ మామూలుగా మాట్లాడ్డానికి ప్రయత్నించాడు: "చూశావా! ఏం తోచడంలేదన్నావని నీకోసం ఓ మాంఛి ప్రోగ్రాం వేశాను. ఎల్లుండి ఆదివారం మనం, ఇంకో నలుగురు ఫ్రెండ్స్ ఫేమిలీస్‌తో—అందరం యిక్కడికి అయిదారు మైళ్ళ దూరాల కొండల మధ్య అడవిలోకి పిక్నిక్ వెళ్ళడానికి ప్రోగ్రాం వేశాం. పొద్దున్నే ఏడింటికి వెళ్లి రాత్రికి తిరిగి రావచ్చు. కారమ్సు, కార్డ్స్, ట్రాన్సిస్టర్ ... కావల్సినంత కాలక్షేపం! మన మంతా తినడానికి కేవన్నా పట్టుకుపోదాం!"

ఉత్సాహంగా చెప్పుకుపోతున్న శేఖర్, లలిత కాఫీకప్పు తెచ్చి ఠాప్‌మని బల్లమీద పెట్టి తిరిగి అదే వేగంతో పడకగదిలోకి వెళ్లిపోడం చూసి కొంచెం తగ్గాడు.

కప్పు చేత్తో పట్టుకొని వెనకాలే నడిచివెళ్లి, "ఏం, అలా ఉన్నావు యివ్వాళ? వంట్లో సరిగ్గా లేదా? ఏదీ చూడనీ!" నుదురుమీద చెయ్యేశాడు. లలిత చెయ్యి తీసేసి కళ్ళుగట్టిగా మూసుకొని అటు తిరిగిపోయింది. శేఖర్‌కి అర్థమైంది.

"ఇప్పుడు శ్రీమతి లలితగారు అలక నభిన యిస్తారు .... చాలు, బాగుంది. మొదటి బహుమతి ఈయడమైంది..... ఇంక ఇప్పుడు నవ్వుతారు." గిలిగింతలు పెట్టబోయాడు.

లలిత నవ్వలేదు.

"నిజం కోపమా, లలితా? ఏం, ఏమపరాధం జరిగింది? .... రాణిగారి కోపం తీర్చడానికైనా కారణం తెలియాలిగా!"

లలిత కళ్లు తెరవలేదు.

"చాల్లే, ఇంతటితో బతిమాలడం కార్యక్రమం అయిపోయింది..... ఇంక నీ కారణం ఏమిటో చెప్పేస్తే, తిరిగ్గా కూర్చొని నీ యిష్టమొచ్చినంతసేపు అలుగుదువుగాని ...." శేఖర్ లేచి ఇవతలికి వచ్చాడు.

లలిత విసురుగా వెనక్కి తిరిగి ఎర్రగా తడిగా ఉన్న కళ్లతో శేఖర్‌కేసి తీక్షణంగా చూసింది.

"అయితే పోవడాని కెప్పుడు తయారుకావాలంటారు?"

"ఇది బాగుంది, ఇంతసేపూ చెప్పిందేమిటి! .... ఎల్లుండి ఆదివారం అన్నానుగా!" నవ్వాడు.

"అదికాదు..... మావాళ్లింటికి వెళ్లడంమాట నేనడిగేది!" తెల్లగా మెరుస్తున్న కళ్లని ఎటో తిప్పింది.

"మీవాళ్లింటికా! .... ఇప్పుడెందుకు?" ఆశ్చర్యంగా అడిగి, అంతలో గట్టిగా నవ్వేశాడు శేఖర్. "ఓహో! ఈ దుమారం అంతా అందుకా? అయితే చిన్న పాపాయికి వచ్చిన నాలుగు నెలలకే అమ్మా, నాన్నమీద బెంగ పుట్టిందన్నమాట! .... దానికోసం ఇంత గొడవెందుకు! సిల్లీ లల్లీ! అడిగితే సరిపోయేదిగా!" లాలిస్తున్నట్టు దగ్గరికి తీసుకోబోయాడు.

లలిత ఆవేశంగా లేచి కూర్చొంది. "నేనేం అమ్మా, నాన్నని చూడాలని ఏడవడంలేదు. !..... మీరే .... నే నిక్కడుండడం యిష్టంలేక .... అనవసరంగా నామీద ఉన్నవీ, లేనివీ కల్పించి .... పంపించేయాలని యెత్తేసి .... పైగా నాటకం!" లలితకి దుఃఖంతో గొంతు పూడి పెదాలు వణకడం తప్పించి మాటలు సరిగా రావడంలేదు.

శేఖర్ కిదేం అంతుబట్టలేదు.

"ఏమిటి నువ్వు మాట్లాడేది? .... ఏమయింది నీకివాళ?"

"చాల్లెండి, ఇంకా ఎందుకు బుకాయిస్తారు ఏమెరుగనట్టు! .... నేను మీకేం చేశాను? ఎప్పుడన్నా మీరు చెప్పింది కాదన్నానా? ఎందుకలా

ఉన్నవి లేనివి కల్పించి రాయడం ?'' కళ్లంట జారే నీళ్లని అతనికి చూపలేక తలగడలో దాచుకుంది.

అలా కళ్లప్పగించి ఆమెవంక చూడ్డం తప్పించి ఏం చేయలేక విసుగ్గా "ఏమిటిదంతా ? నేను నీమీద కల్పించి ఏం రాశాను, ఎవరికి రాశాను ! సరిగా చెప్పకుండా యీ గోలేమిటి ?''—శేఖర్.

"అవును, గోలగానే ఉంటుంది మరి ! చేసేవన్నీ గప్‌చుప్‌గా చేసేసి ఏమీ తెలియనట్టు వేషాలు !... ఇంకా విడమర్చి నా నోట్తో చెప్పాలి గాబోలు !''

"ఏ సంగతీ చెప్పకుండా ఏమిటో గొడవ ? చెప్ప దలిస్తే స్పష్టంగా చెప్పు. లేకపోతే నీ ఖర్మ ! .... నేనేం నీ గురించి ఎవరికీ ఏమీ రాయలేదు, అన లేదు !'' శేఖర్ గొంతు యిప్పటికి, లలితతో సమానస్థాయికి వచ్చింది.

లలిత వెంటనే లేచి టేబిల్ సొరగు లాగి స్వదేశీ కవరు ఒకటి తెచ్చి యిచ్చింది.

"ఇదేమిటి ? ..... ఒకవేళ చేతికొచ్చినట్లల్లా రాసేస్తూ నాతో ఈ దొంగనాటకాలెందుకు ? .... మీకేదయినా కష్టంగా ఉంటే నాతో చెప్ప వచ్చుగా .... ! వాళ్లకి, వీళ్లకీ రాయడం ఎందుకు ? .... ఇదే కాబోలు ఆపేక్ష, అభిమానం అంటే ! ...'' శేఖర్ ఉత్తరం చదువుతున్నంతసేపూ నిర్విరామంగా మాటలు వదుల్తూనే ఉంది లలిత, కసి తీరేలాగ.

ఉత్తరం పైనించి కిందికంటా చదివాక శేఖర్ మొగం, ఏ భావం తెచ్చుకోవాలో తెలియక, ఏం వెలిబుచ్చకుండా దిగాలుపడింది.

"ఈయన యిలా రాస్తాడేమిటి ? నేనేం రాయ లేదే ! ....'' సగం తనలోనే అనుకున్నాడు శేఖర్.

"మీరేం రాయకుండా ఉత్తినే తీరిక్కూర్చొని అలా రాశారా ఆయన !'' వ్యంగ్యం, కోపం రెండూ లలిత గొంతులో పోటీ పడుతున్నాయి.

"ఏదో పొరపాటు జరిగింది. అసలు నెలయి ఉత్తరమే రాయలేదు నేను .... యింతకీ నీమీద అలా ఎందుకు రాస్తాను ? ఏం జరిగిందని ? నీదగ్గిర దాచేటంత అవసరం నాకేముంది ?'' అనునయించబోయాడు.

"అయితే పెద్దాయన, ఆయన అబద్ధమాడా రంటారు ! .... ఇంక చాల్లెండి !''

ఎప్పుడూ నవ్వే లలితమొగం ఇంత కోపం దూబెడ్తుంటే మాటలు వెంటవెంటనే తట్టటం లేదు శేఖర్‌కి.

"నీకెలా చెప్పాలో అర్థంకావటంలేదు .... మీ నాన్నగారికి ఇవాళే నీ యెదురుగ్గా ఈ విషయం ఏమిటో, ఎందుకలా రాశారో స్పష్టంగా తెలియ జెయ్యమని రాస్తాను. సరేనా ! .... లేకపోతే .... అంతకన్నా, టెలిగ్రాం యిస్తే ఆయనే వస్తాడు. ఏ సంగతీ ఆయన నోటినుంచే విందువు గాని ! అంతవరకు ఆగు కొంచెం !'' ఆమె భుజాల మీద నిమురుతూ సాధ్యమైనంత సౌమ్యంగా అన్నాడు శేఖర్.

"ఇంక అదొహటి తరువాయి ! మొగంమీద చీవాట్లు పెట్టించడం మిగిలింది గాబోలు !..... ఇంతటితో చాలు .... నన్ను క్షమించి వంపిం చెయ్యండి'' కళ్లు తుడుచుకుంటూ అంది.

"చెప్పేది వినిపించుకోడం మంచిది, లలితా ! నామాట నమ్ము. ఆయన వచ్చాక, అంతా విని అప్పుడు నీ యిష్టం వచ్చినట్టు చేద్దువుగాని !— బాగా ఆలోచించు. చదువుకొన్నదానివి, నీ కింత తొందర, మొండితనం కూడదు !'' శేఖర్ ఓర్మికి, మంచితనానికి అది చివరిమెట్టన్న సంగతి లలితకి తెలుసు.

ఇంక చెప్పాల్సిందేం లేదన్నట్లు బూట్లు విప్పుకోసాగాడు శేఖర్. లలిత గదిలోంచి బయటికి వెళ్లిపోయింది.

పెళ్లయిన తర్వాత నాలుగు నెలలు నాలుగు సెకన్లలా గడిచాయి గాని ఆ సాయంకాలం ఒక్కటే ఒక యుగమై పోయింది. ఎన్నడూ ఇంత ఇదిగా నాటకం ఫక్కీ సంభాషణలు యిద్దరి మధ్యా జరగ లేదు. అతసలు లలిత ఆ రకం కాదు. సాధ్యమైనంత వరకు యెదటివాళ్ళకి సరిపడేలాగే నడుచుకు పోదా మన్న మనస్తత్వం. శేఖర్ విషయంలో అసలు ఎన్నడూ ఎదురుమాటన్నది చెప్పలేదు—తమాషాకి, హాస్యానికి తప్పిస్తే. అలాంటిది ఇప్పుడింత రభస చేస్తూందంటే పాపం, నిజంగా చాలా కష్ట పెట్టుకొందన్నమాట. ఎప్పుడూ సంతోషంగా కని పించే మొగం కాస్త వాడిపోయింది. కళ్లు వాచాయి. ఉత్తరం వచ్చిం దగ్గర్నుంచి ఏడు స్తూంది బాబోలు ! .... నిజంగా ఆ ఉత్తరంలో విషయాలు చదివితే అలానే అనిపిస్తుంది మరి ! అందులోనూ ప్రాణాల్తో సమానంగా నమ్మిన మనిషి ఒక్కసారి, మోసం చేశాడని తెలిస్తే ఎలాంటివాళ్లకైనా అంతే !

శేఖర్ మెదడు ఆలోచనల్తో వేడెక్కింది. ఎవ రైనా ఏడిపించడానికి అలా రాశారా ? ఎవరు రాస్తారు ? అంత ప్రాక్టికల్ జోక్సు వేసేపాటి చనువు ఎవరికుంది ? అసలు ఆ ఊరు వచ్చి ఆర్నెల్లయిందేమో ! ఇంకా ఆ వీధిలో వాళ్ళే సరిగ్గా పరిచయం కాలేదు. ఆఫీసులో వాళ్లకి లలిత వాళ్ల ఊరు, తండ్రి యెడ్రసు అన్నీ ఎలా తెలుస్తాయి ? తెలిసినా యిలాంటి పని చెయ్యా డాని తగినంత చనువు ఎవరికుంది ? ఈ ప్రశ్న లిలా డొంకల్లా పెరగడమే గాని విడ్డంలేదు. చివరికి బట్టలు మార్చుకుని టవలు తీసుకొని బాత్‌వైపు నడిచాడు.

ఇన్నాళ్టికి మొదటిసారి స్వహస్తాలతో బూట్లు విప్పుకొని, టవలు తనే తీసుకొని ఒక్కడే వెళ్తున్న శేఖర్ వంక చూసి లలిత మనస్సు చివుక్కుమంది. అన్నీ ఆమె చేతిమీదుగా జరగడం అలవాటు. అసలు ఏమీ చేసుకోలేని చిన్న పిల్లా డిలా చిలిపిగా అల్లరిచేస్తూ అన్నిటికీ ఆమెని విసి గించడం అతనికి సర్దా. ఆఫీసుకి వెళ్లేప్పుడు ఏ ద్వీపాంతరవాసానికో వెళ్తున్నట్టు, పదిమాట్లు దగ్గిరకి తీసుకొని, అదీ యిదీ సర్ది, ఏమిటో కబుర్లు చెప్పి వెళ్లలేక వెళ్తున్నట్టు వెళ్ళేవారు ! సాయంత్రం గుమ్మంలోంచే నామస్మరణ మొదలు.

అంత మనసిచ్చే మనిషి ఇలాంటి పనెందుకు చేశారు ? అంతా నటనేనా ? ఏది నటన ? కాసేపు తనేడిస్తే చూడాలనిపించిందా ? అదేం ముచ్చట ? పోనీ అదే అయితే యిప్పుడైనా అసలు సంగతి చెప్పవచ్చుగా ? తనకేం తెలియదని డబా యించడం ఎందుకు ? .... ఇంట్లో అంతా అమ్మ, అన్నయ్యలు, అక్కయ్యలు అంతా ఏమను కుంటున్నారో ? అసలు ఆ ఉత్తరం చదివాక అయిదు నిముషాలదాకా ఏం పాలుపోలేదు. ఎంత చిన్నతన మనిపించింది ? వేళాకోళమైతే మాత్రం ఇంత దారుణమా ?

లలిత మనసు కొంతకాలం ఊగులాడి చివరికి తండ్రి వచ్చేదాక వేచియుండాలన్న నిశ్చయాని కొచ్చాక ఆగింది.

మూడోరోజు ఉదయం ప్రసాదరావుగారు వచ్చే వరకు ఇద్దరూ భారంగా గడిపారు. రోజూ మామూలుగా ఎంతో గొడవతో, మాటల్తో, నవ్వుల్తో జరిగే పనులు, గడియారం ముల్లు జరిగినట్టు నిర్లిప్తంగా జరగక తప్పదు కాబట్టి జరుగుతున్నట్టు జరిగిపోయాయి.

ప్రసాదరావుగారు వస్తూనే, "ఏమిటోయ్ ! ఎలా ఉందిప్పుడు ? అసలేమయింది ?'' ఆదుర్దాగా ప్రశ్నించాడు శేఖర్ని. తండ్రి గొంతు విని బయటికి వచ్చిన లలితని చూసి, "ఏమమ్మా ! టెలిగ్రాం యిచ్చి గాభరాపెట్టేదానికి ఓ వారం రోజుల్ని ముందు కాస్త వివరంగా ఉత్తరం రాస్తే ఏం



పోయింది ?" అన్నాడు. లలిత అర్థంకాలేదు శేఖర్‌వంక చూసింది.

"మరేంలేదు, దుక్కలా ఉన్నాను. మీరు పూరికే ఖంగారుపడి పోకండి. మీతో కొంచెం పనుండి మాట్లాడాలని, అలా అంటే వెంటనే రారేమోనని టెలిగ్రాం యిచ్చాను. ఆసంగతి ఆవిడకి తెలియదు. ఆవిడ నడక్కండి."

కాఫీ తెస్తానంటూ లోపలికి వెళ్ళిపోయింది లలిత.

"బలేవాడివోయ్ ! ఎంత అర్జంటు పనైతే మాత్రం అలా ప్రాణంమీది కొచ్చిందని వైరివ్వడ మెందుకు ? ఇంట్లో అంతా గాభరాపడి చచ్చాం !"

"జబ్బు లేదన్నమాటే గాని, విజంగానే ప్రాణం మీది కొచ్చింది.... ఆ సంగతి తర్వాత మాట్లాడ్దాం. ముందర మీరు వెళ్ళి స్నానం వగైరా కానివ్వండి."

కాఫీ తెచ్చి అందించింది లలిత. వాళ్ళిద్దరి మొగాలు చూశాక ప్రసాదరావుగారికి అర్థం కావాల్సింది కొంత అర్థమయింది. తలొంచుకొని లోపలికి వెళ్ళాడు.

తొమ్మిది గంటలకి ముసలాయన జపం, తపం అన్నీ కానిచ్చి వచ్చాడు. తండ్రికి, భర్తకి మరోసారి కాఫీ అందించి లోపలికి వెళ్ళబోతున్న లలితతో శేఖర్ "ఉండు, లలితా, కూర్చో" అన్నాడు.

సగం వెళ్ళిన లలిత అక్కడే ఆగి ఓరగా నిలబడింది తల దించుకొని. ఇద్దరినీ మార్చి మార్చి చూస్తున్న ప్రసాదరావుగారికిదంతా ఇబ్బందిగా ఉంది. తెల్లబోయారు.

"ఏమిటో చెప్పవోయ్ ! .... ఏమన్నా ప్రణయ కలహమేమిటి ?" కొంచెం ఆదుర్దాగానే నవ్వారు.

కాఫీ కొద్దికొద్దిగా తాగుతూ ఎలా ప్రారంభించాలా అని ఆలోచిస్తున్నాడు శేఖర్.

"పోనీ, నువ్వు చెప్పమ్మా !"

లలిత ఎడంకాలు బొటనవేలు నేలమీద రాస్తూ అటే చూస్తోంది.

శేఖర్ గొంతు సవరించుకొని కప్పు టీపాయ్ మీద పెట్టి మొదలెట్టాడు.

"మీరు రెండు రోజుల క్రిందట ఒక ఉత్తరం రాశారు. దాంట్లో ...."

"నేను రెండు రోజుల క్రితం ఏం రాయలేదే?"

"మీరేం రాయలేదా ? సరిగ్గా గుర్తు చేసుకోండి."

"ఇందులో గుర్తు లేకపోవడాని కేముంది ? అసలు నే నెప్పుడోగాని ఉత్తరాలు రాయను. ఆఖరిసారి ఉత్తరం రాసింది మా కృష్ణుడికి. పదిహేను రోజులయింది. , అంతే !"

"పోనీ, నేను మీకు యిటీవల ఓ నెలలో ఉత్తరమేదన్నా రాశావా ?"

"నెలలో కాదుగదా ! ఈ నాలుగు నెలల్లోనూ మొదటి నెల తప్పించి అసలు ఉత్తరమే రాయలేదని మేమంతా యిదవుతుంటే !"

"అయితే ఇదెవరు రాశారంటారు ?"

ప్రసాదరావుగారు ఉత్తరంపైనుంచి కిందదాకా చదివారు.

"చిరంజీవి శేఖర్‌ని ఆశీర్వదించి వ్రాసేది—

నీ ఉత్తరం అందింది. ఉత్తరం చదివాక ఎంతో ఆశ్చర్యమూ, విచారం కలిగించాయి.

మామూలు కథే

పెళ్ళయిన మొదటి ఏడాది సాధారణంగా ఎంతో ఆనందంగా, అన్యోన్యంగా గడపాల్సిన సమయం. అప్పుడే మీలో మీకు మనస్పర్థలు రావడం చూస్తే—ఎక్కడో అతుకు కుదరక, కుదుర్చుకో లేక బాధపడుతున్నా రనిపిస్తుంది. అమ్మాయికి నీవంటే ఎంతమాత్రం లక్ష్యంలేదని, చెప్పినా వినకుండా సినిమాలకి, బట్టలకి, క్లబ్బు పార్టీలకి, స్నేహితులకి జీతమంతా తగలేస్తుందనీ రాశావు. ఇవన్నీ చాలా పెద్ద ఆరోపణలు. ఇవే నిజమయితే తప్పకుండా నువ్వన్నట్టు మనశ్శాంతి లేకపోవడం, ఇల్లు నరకమవడం ఖాయం. అయితే ఇలాంటివి వీలయినంతవరకు మీలో మీరే పరిష్కరించుకోడం మంచిదనుకుంటాను. "పరిస్థితులకి విసిగిపోయి, ఇంక గత్యంతరంలేక, తండ్రిగా మీరయినా ఆమెకి బాధ్యతలు నేర్పుతారన్న ఆశతో ఎంతో సిగ్గుపడుతూ ఈ ఉత్తరం రాస్తున్నాను." అని రాశావు.

నువ్వింతగా బాధపడి రాశావంటే నాకూ చాలా కష్టంగా ఉంది. ఇద్దరు చిన్నవాళ్ళు ఒంటరిగా కలిసి మెలిసి ఉండేప్పుడు ఏవో చిన్నచిన్న అభిప్రాయభేదాలు, కలతలు రావడం సహజం. నువ్వు వాటినే పెద్దవి చేస్తున్నావేమోనని అనుమానంగా ఉంది. మా అమ్మాయిని వెనకేసుకుని వస్తున్నా

ఇద్దరు పిసినిగొట్లు సినీమాకి వెళ్లారు. క: నావద్ద పర్సు వుంది గాని పైకం మరిచా. గ: నావద్ద పర్సుకూడా లేదు మరిచిపోయా.

ననుకోవద్దు. ఒకవేళ అమ్మాయి చిన్నతనం కొద్దీ తెలివితక్కువగా మాట్లాడి నీ కిష్టంలేని పని చేసి ఉండవచ్చు. అయితే నీ కప్పగించాక, దాన్ని సరిదిద్దాల్సిన బాధ్యత నీదే. అంతేగాని మీమధ్యలో ఇంకొకరు, తల్లయినా, తండ్రయినా కలుగజేసికోడం మంచిదిగాదని నా ఉద్దేశ్యం. అయినా, నీమాట కాదనదల్చుకోలేదు.

ఎలాగూ ఈ విషయాలు నాదాకా తెచ్చేవు కాబట్టి, నాకు చేతనయినంతవరకు నచ్చజెప్పడానికి ప్రయత్నిస్తాను. నాకు యిక్కడ పనులన్నిటిమధ్యా అక్కడికి రావడం కుదరదు. అమ్మాయినే ఒక్కసారి నువ్విక్కడికి పంపితే అన్ని సంగతులు దాని నోటంట కూడా విని, మంచి చెడ్డలు తెలియజెప్పి పంపడానికి వీలుంటుంది. ఎప్పుడు బయలుదేరేదీ రాస్తే స్టేషనుకి నేనో, అబ్బాయో వస్తాం. ఉత్తరంలో ఇంతకంటే ఇంకేం రాసినా బాగుండదు. తప్పక పంపగలవని ఆశిస్తాను.

ఇట్లు,

కా. ప్ర. రావు"

ఉత్తరం అంతా చదవడం అయ్యాక ప్రసాదరావుగారు షాక్‌తిన్నట్టు టేబిల్‌మీదికి విసిరేసి—

"ఎవడు రాశాడిది ! నా రైటింగు కాదు !" అన్నారు.

"మీరు రాయలేదా ?" లలిత, శేఖర్ గొంతులు కలిశాయి.

"రాస్తే రాయలేదనెందుకంటాను ? అయినా శేఖర్ ! నీ కసలు తెలుగులో యెప్పుడన్నా రాశానా? ...నీకూ తెలియదమ్మా ఇది నా రైటింగు కాదని ! అంతమాత్రం ఆనవాలు తెలియదూ !" ప్రసాదరావుగారికి కొద్దిపాటి చికాకు, కోపం కలిగాయి.

"ఏమో నాన్నా ! నేను నీ తెలుగు రాత యెలా ఉంటుందో సరిగ్గా చూడలేదు. అసలు ..... అంత దూరం ఆలోచించనేలేదు !" నేరం చేసినదానిలా శేఖర్ వేపు దొంగచూపు ఒకటి చూసి సిగ్గుతో తలొంచుకొని నసిగింది.

"అవుననుమండీ ! మీరు సాధారణంగా ఇంగ్లీషులోనే రాస్తారు. ఈ ఉత్తరం చూసినప్పట్నుంచీ మీ అమ్మాయి గోలతో మతి పోగొట్టేసింది. ఆ తుఫానులో అసలుమాటే తోచలేదు."

లలిత బుగ్గలు ఎరుపెక్కి, శేఖర్ నుంచి మొగం దాచుకుంది.

"ఇంతకీ సమస్య పరిష్కారం కాలేదు !" నవ్వాడు శేఖర్.

"మరే ! ఇదెవరు రాశారంటావ్ ! ఎందుకు రాసినట్లు ? నీపేరు, నాపేరు, నీ చిరునామా అన్నీ తెలిసినవా డెవడో యీపని చేసుండాలి !" ఉత్తరం అటూ యిటూ తిప్పుతూ ప్రసాదరావుగారు స్వగతం చెప్పాడు.

"ఇదుగోవోయ్ ! శేఖర్ ! అసలిది నీ ఉత్తరం కాదు.... చంపావ్ పో !" ఆశ్చర్యంతో, గట్టిగా నవ్వేశాడు.

శేఖర్, లలిత ఒక్కసారి "ఆ" అంటూ ముసలాయన కుర్చీ చెరోవైపూ చేరారు.

"చూశావా, ఆర్. శేఖర్ బదులు కె. శేఖర్ అని ఉంది. మీ యింటి నెంబరు నాలుగు అయితే, ఇది వీధి నెంబరు నాలుగు. ఇదంతా పోస్టలు డిపార్టుమెంటు ఘనకార్యం !" ప్రసాదరావుగారి ఆనందాని కంతులేదు. విరగబడి నవ్వసాగాడు పెద్ద విజయం సాధించినట్టు.

"అమ్మయ్య ! మూడు రోజుల్నుంచి బుర్రబద్దలు కొట్టుకున్నాం." నవ్వింది లలిత.

దీని కంతకీ కారణం ఎవరంటారు ? .... యిదిగో, ప్రబుద్ధురాలు !" నవ్వాడు శేఖర్. లలితకి జవాబు చటుక్కున స్ఫురించక చిన్న కోపం తెచ్చిపెట్టుకుని చూసింది.

"మొత్తంమీద ఇద్దరూ సరిపోయారు ! నా పనులన్నీ చెడగొట్టి యిక్కడికి పిల్చి ! .... ఇంతకీ అందులో అల్లుడి పేరు శేఖర్, మామగారి పేరు కా. ప్ర. రావు. సరిగ్గా అతకడం తమాషా ! .... నే నిప్పుడే అలా పోయొస్తాను కాసేపు" అని బయటికి నడిచారు ప్రసాదరావుగారు. ఆయనకున్న అనుభవం అపారం, విశాలం.

పారిపోతున్న లలితని కొంగు పట్టుకుని ఆపుచేసి వెనక్కి తిప్పి కళ్ళల్లోకి చూస్తూ, "అయితే అమ్మాయ్ ! నువ్వు కాలేజీలో ఏం చదివావు ? ఎడ్రస్సైనా చదవడం చేతగాదు .... నిన్ను గాదు, నీకు డిగ్రీ యిచ్చిన యూనివర్సిటీ ననాలి అసలు !" శేఖర్ అన్న మాటలకి—

అతని హృదయంలో యిమిడిపోతూ, సిగ్గుతో "నా దొక డిగ్రీ అయితే, రెండు డిగ్రీలున్న మీ తెలివితేటలు .... " అనబోతున్న లలితని మాట పూర్తిచెయ్యనియ్యలేదు శేఖర్. ★